## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-08-2003, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు ఏ పనిచేసినా ఆనందం కోసమే చేస్తాడు. వాడు మంచిపనులు చేసినా, చెడుపనులు చేసినా వాడు చేసేపనుల ద్వారా నిజంగా ఆనందం రాకపోయినా, ఆనందం వస్తుందని ఆపనులు చేస్తూఉంటాడు ముఖ్యంగా మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే నన్ను నేను బ్రహ్మంగా చూసుకోవాలి, నేను మిమ్మల్ని బ్రహ్మంగా చూడటం నేర్చుకోవాలి, అప్పుడు వికారాలు రావు. ఇలా అభ్యాసం చేస్తూఉంటే, నిరంతరం బ్రహ్మభావనతో ఉంటే ఏదోరోజున బ్రహ్మానుభవం కలుగుతుంది, బ్రహ్మానుభవం కలిగాక బ్రహ్మానందం వస్తుంది. బ్రహ్మం ఎక్కడ ఉంది అంటే మనహృదయంలోనే ఉంది కాని దానిని తెలుసుకోవాలనే కాంక్ష మనకు ఉదయించటంలేదు దానికి కారణం మనకు తగినంత పుణ్యబలం లేదు. బహుజన్మలు సత్కర్మలు చేస్తేగాని, బహుజన్మలు సద్వస్తువు గురించి శ్రవణంచేస్తేగాని ముముక్షత్వంరాదు. భక్తులువేరు, ముముక్షులువేరు. మంచిపనులు చేసేవారుకూడా ఏదో స్వర్గలోకానికి వెళ్ళవచ్చు అనిచేస్తారు. వారు స్వర్గలోకానికి వెళితే వెళ్ళవచ్చుగాని హృదయంలో ఉన్న వస్తువు మటుకు వారికి తెలియదు. బ్రహ్మానుభవం కలిగేవరకూ, హృదయంలోఉన్న వస్తువు వాడికి గోచరమయ్యేవరకు వాడు ఎంతగొప్పలోకాలకు వెళ్ళినా ఏజీవుడికి పతనం తప్పదు. ఈసృష్టికి యజమాని ఈశ్వరుడే. ఆయన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి, ఆ జీవులు చేస్తున్న పనులనుచూస్తూ వాటికితగినఫలితాన్ని ఇస్తూ ఈసృష్టిని నడుపుతున్నాడు. ఆయనకు తెలియకుండా ఈసృష్టిలో ఏదీజరగటానికి వీలులేదు, జరుగదుకూడా. అయితే ఈశ్వరుడి మీద మనకు ఉండవలసినంత గౌరవంలేదు, విశ్వాసంలేదు. మనం పుణ్యంచేసినా, పాపంచేసినా వెంటనే ఫలితంరాదు, అది పండటానికి కొంతకాలం పడుతుంది. ఈరోజు పుణ్యంచేసి ఇంకా ఫలితంరాలేదు అని అనుకోవద్దు. ఆఫలితం ఎప్పుడు ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో నిర్ణయించేది ఈశ్వరుడు. పాపఫలితం దుఃఖం, పుణ్యఫలితం సుఖం. మీకు అనుభవం అయినతరువాత కాలప్రవాహంలో పాపఫలితం, పుణ్యఫలితం రెండూ కూడాపోతాయి. ఆత్మజ్ఞానం వలన వచ్చేఫలితం మోక్షం. జీవుడు మోక్షానుభవం పొందేవరకు వాడికి మరణంతప్పదు, పుట్టుక తప్పదు, కర్మానుభవం తప్పదు, ప్రకృతి వాడిని విడిచిపెట్టదు.

సంసారం ఎవడికివస్తుంది అంటే వాసనఉన్నవాడికి సంసారం వస్తుంది. వాసనకూడా





ఒకరోగం, అదిఎంతకాలం అయితే ఉందో అంతకాలం సంసారం తీసుకొనివస్తుంది. లోపలఉన్న సత్యవస్తువు మనకు అనుభవానికి రాకుండా చేసేదికూడా వాసనే. వాసనవలన రెండు ప్రమాదాలు ఒకటి అది సంసారంను తీసుకొనివస్తుంది, రెండు లోపలఉన్నవస్తువును అనుభవంలోనికి రానివ్వదు. బయటఏదో కల్పిస్తూఉంటుంది. తాడు తాడే కాని నీవుదానిని తొంబైరకాలుగా అనుకోవచ్చు. తాడు తాడనేసత్యం తప్పించి ఇంకోసత్యంలేదు. తాడును మీరుఒకరకంగా చూడవచ్చు, నేను ఒకరకంగాచూడవచ్చు. అది మీపిచ్చి, ఇది నాపిచ్చికాని తాడుతాడే. అలాగే ఉన్నది బ్రహ్మమే అది తప్పించిఏదీలేదు. ఆబ్రహ్మమును నీవు ప్రపంచం అనుకోవచ్చు, జీవుడు అనుకోవచ్చు, కర్మఅనుకోవచ్చు, పుణ్యంఅనుకోవచ్చు, పాపంఅనుకోవచ్చు కాని బ్రహ్మంతప్పించి రెండోది అంటూఏదీలేదు, ఒకవేళ ఉందని నీవుఅనుకొన్నా అది నీకల్పితమే. ఇదిమీకు అర్థమయితే దుఃఖంలేనిస్థితిని పొందుతారు. అయితే ఇది పాండిత్యంవలనరాదు, ధనంవలన రాదు, యశస్సువలనరాదు, కేవలం మంచిపనులు చేయటంవలనరాదు, ఈశ్వరునికరుణవలన కలుగుతుంది. ఓంవైద్యాయనమః అంటే వాసన అనేరోగాన్ని తీసేవైద్యుడు నారాయణుడు. ఆయనపాదాలను ఆశ్రయిస్తే, ఆయనపట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే వాసన అనేరోగాన్ని తొలగిస్తాడు. మనం ఎంతసేపు వారికి ప్రియులుగా ఉండాలి, వీరికి ప్రియులుగా ఉండాలి అనుకొంటే చివరకు బానిసత్వంవస్తుంది. మనం నారాయణుడికి ప్రియులుగా అవ్వాలి, అలా అయితే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. భౌతికసంపదకంటే ఆధ్యాత్మికసంపదగొప్పది. భౌతికసంపద తిండికి, బట్టకు, ఇంటికి ఉపయోగపడుతుంది. అంతకంటే ఎక్కువ ఉంటే భోగాలు అనుభవించటం ప్రారంభిస్తాము. ఈజన్మలో అనుభవించేభోగాలే రాబోయేజన్మలో రోగాల క్రిందవస్తాయి. ప్రపంచంలో మీకు కనిపించేభోగాలు అన్నీ అవిభోగాలుకాదు అవిదౌర్భాగ్యాలు అని ఒక ఋషిచెప్పారు. మీకు ఏదైనా భౌతికసంపదఉంటే అది మిమ్మల్ని నియమించకూడదు, మీరే ఆసంపదను నియమించాలి. భౌతికసంపద పునర్జన్మలోనికి రాదు, ఆధ్యాత్మికసంపద పునర్జన్మలోనికి వస్తుంది. భగవంతుడిని తెలుసుకోవటానికి ఇప్పుడు చిన్నప్రయత్నంచేసినా ఈప్రయత్నం, ఈసాధన రాబోయేజన్మలో నీకు కలిసివస్తుంది. ఈశరీరంచనిపోయేలోపు ఒకవేళనీకు జ్ఞానం కలుగకపోయినా నీవుకంగారుపడవద్దు, నీవుచేసిన సాధనఅంతా కూడా నీకు రాబోయే జన్మలోకలిసివస్తుంది అని భగవంతుడు చెప్పాడు. తాడు తాడుగా కనిపిస్తే భయకారణంలేదు, తాడుపాముగా కనిపిస్తే భయంకలుగుతోంది. నిజంగా పాములేదు,

ఉన్నదితాడే. ఈలోకంలేదు, ఈలోకం ఉన్నదానివలె నీ మనస్సుకు కనిపిస్తోంది. మనస్సు అణిగిపోతే ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలుస్తుంది. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోకుండా ఏదో ఆసనాలు వేస్తున్నాము, ముక్కులో గాలి చూసుకొంటున్నాము అంటే భగవంతుడు మోసపోడు. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోండి, రాజీపడవద్దు, రాజీపడుతున్నారు అంటే మీకు ఎక్కడో బానిసత్వం ఉందిఅనిఅర్థం. బానిసత్వంలో ఎంతకాలం బ్రతుకుతారు. ఆత్మవిశ్వాసం లేనివారికి ఆత్మజ్ఞానం కలుగదు. ముందు ఆహారనియమంముఖ్యం ఆహారనియమము వలన నీకు ఇంద్రియనిగ్రహం వస్తుంది, ఇంద్రియనిగ్రహం వలన మనోనిగ్రహం కలుగుతుంది. ఆహారశుద్ధివలన అంతఃకరణ శుద్ధి వస్తుంది. మీరు ఏదైనా ఒక అలవాటులోనుండి బయటపడాలంటే ఎంతో సాధనచేస్తేగాని దానిలోనుండి విడుదల పొందలేరు. వాసన యొక్క వేగం తగ్గాలంటే ఈశ్వరుని పాదాలయందు నీకు భక్తికుదరాలి, ఆయన మీదనీకు పరిపూర్ణమైన విశ్వాసంఉంటే తప్ప వాసననశించదు. సమాజంతో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి. అతిగా ఉండకూడదు, అతిగాఉంటే లోకవాసనపెరుగుతుంది. మనకు మనస్స ద్వారా, దేహంద్వారా లోకంతోటి అనుబంధంవస్తోంది. దేహం ఉన్నవాడికి, మనస్సుఉన్నవాడికి లోకంగాని, దేహంలేనివాడికి, మనస్సలేనివాడికి లోకంలేదు. ఇది ముందు అర్థం చేసుకోవాలి. సమాజానికి ఉపయోగపడటంవేరు, లోకవాసన పెంచుకోవటంవేరు. పద్మం బురదలోనే ఉంటుంది గాని పద్మానికి ఆబురద అంటుకోదు అలాగే మనంలోకంలో ఉన్నా లోకంయొక్క బురద మనమనస్సుకు అంటుకోకుండా చూసుకోవాలి. అది ముఖ్యం. నీలోఏదైనా బలహీనత ఉంది అనుకో. అదిలేనివారితో సహవాసంచేస్తూ, రెండోప్రక్క ఈశ్వరుని ప్రార్థిస్తూ ఇలా సిన్సియర్‌గా చేస్తూఉంటే కొంతకాలానికి ఆవాసననశిస్తుంది. ఒకరోజు గౌతమబుద్ధుడి దగ్గరకు ఎవరోవచ్చి నిందించారు, ఆయన ప్రశాంతముగాఉన్నాడు, ఏమీసమాధానం చెప్పలేదు. అతను మరుసటిరోజున వచ్చినేను మిమ్మల్ని నిందించి చాలాపొరపాటుచేసాను, సారీ అన్నాడు. అప్పడు బుద్దుడు ఏమిచెప్పాడు అంటే మీరు నిందించేటప్పడు నాలోపలఏమైనా వికారంవస్తోందా, లేదా అని చూసుకొన్నాను, అదిచూసుకోవటానికి మీరు ఉపయోగపడ్డారు, మీరు కూడా నాకు గురువే అని చెప్పాడు. ఏమనిషి అయినా బాగుపడటానికి వాడే కారణం, పాడైపోవటానికి వాడేకారణం, వాడి మనస్సును జాగ్రత్తగా కంట్రోలు చేసుకొంటే బాగుపడతాడు, మనస్సును కంట్రోలు చేసుకో లేకపోతే పాడైపోతాడు.





ఈశ్వరుడికి దీనికి సంబంధంలేదు. వాడు తన మనస్సును ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరుడి సహాయంవస్తుంది. సమాజంలో ఎంతోకొంతక్రూరత్వం ఉంటుంది. ఆక్రూరత్వాన్ని ఎంతవరకు తట్టుకోగలుగుతున్నావు అది నీకు పరీక్ష. మీరాభాయిని అత్తమామలు అనేక బాధలుపెట్టారు. మీరాభాయి ఒక మాటచెప్పింది అత్తమామలు పెట్టే ఇబ్బందివలన భగవంతుడిని పొందాలనే కాంక్షలోగాని, భగవంతునిమీద నాకుఉన్న ఏకాగ్రతలోగాని ఏమీడైవర్షన్ రాలేదు అని చెప్పింది అంటే నామనస్సు ప్రక్కకు తిరగలేదు అని చెప్పింది. ఆవత్తిళ్లకు తట్టుకోలేక ఆవిడమనస్సు ప్రక్కకు పోయింది అనుకోండి, గమ్యాన్ని మర్చిపోయింది అనుకోండి, ఆవిడపతనమయిపోతుంది. మనపని ఏదోమనం శ్రద్ధగా చేసుకోవాలి. మీరు సమాజానికి ఉపయోగపడాలంటే ఉపయోగపడవచ్చు అదయినా కర్తలేనికర్మచేయాలి. మీపూర్వజన్మలు ఎలాంటివి అయినా, ఇప్పడు ఈజన్మలో మీరు ఎలాఉన్నా ఈశ్వరుడిచేతిలో పనిముట్టుగా ఉండటం నేర్చుకొంటే మీ జన్మలతో నిమిత్తం లేకుండా మీ దుఃఖం అంతా ఇప్పడేఇక్కడే ఈక్షణంలో చల్లారిపోతుంది. ఎంతపెద్దగడ్డిమేటు అయినా ఒక్క అగ్గిపుల్లకు లోకువ అలాగే మీలో ఎంతదుఃఖం ఉన్నా అది శరణాగతికి లోకువ.

మనం పొందవలసిన వస్తువు మనహృదయంలోనే ఉంది. అది శాంతిగాఉందికాని మనం అశాంతిగా ఉన్నాము, అది సుఖంగా ఉంది కాని మనం దుఖంగా ఉన్నాము. లోపలఉన్న వస్తువునిశ్శబ్దంగా ఉంది కానిమనం శబ్దం శబ్దంగా, గొడవగొడవగా ఉన్నాము, లోపలఉన్నవస్తువు సింపుల్‌గా ఉంది కాని మనం కాంప్లికేటెడ్‌గా ఉన్నాము, అదిఏకంగా ఉంది కాని మనం అనేకంగా ఉన్నాము ఇంకవారు మనకుఎలా తెలుస్తారు. మనంచేసే సాధనకూడా విసుగ్గా చేయకూడదు. లోపలఉన్నవస్తువు ఎంత నిర్మలంగా ఉందో మనంచేసే సాధన కూడా అంతనిర్మలంగా ఉండాలి. మనకు సబ్జక్టు శ్రవణంచేసే అలవాటు తక్కువ. మీరు పదిలక్షలు తెచ్చుకోండి, పదిబస్తాలు కందిపప్పతెచ్చుకోండి యజ్ఞముచేస్తాము, స్వర్గంవచ్చేస్తుంది అంటే వేసుకొని పోతాము. యజ్ఞముచేసేవాడికి సబ్జక్టు అక్కరలేదు, యజ్ఞంచేయించే వాడికి సబ్జక్టుఅక్కరలేదు. ఒక శాస్త్రీయదృక్పదంలేదు, సొంతంగా ఆలోచించుకోవటంలేదు. యజ్ఞశబ్దానికి అర్థం ఏమిటిఅంటే నువ్వు స్వార్థంలేకుండా ఏపనిచేసినా అది యజ్ఞమే. మోక్షంపొందాలి అనే కాంక్షతప్పించి మీకు ఏచిన్నకోరికఉన్నా మీరు గమ్యానికి వెళ్లలేరు. నీకు చిన్నకోరిక ఉన్నా అదిఈశ్వరుడుచూస్తూ ఉంటాడు దానికోసం నిన్ను ఇంకోజన్మలోనికి పంపుతాడు గాని మోక్షంమాత్రం ఇవ్వడు. మీదేహప్రారబ్దమును

బట్టి స్నేహితులు, విరోధులు, చుట్టాలు దొరుకుతారు, మీ దేహప్రారబ్ధమునుబట్టి వారు సిద్ధమవుతారు దానికి ఇతరులను నిందించవలసినపనిలేదు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీవు లోకంతో సంబంధంతగ్గించుకో, ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండు, అతిగాఉంటే లోకవాసనపెరుగుతుంది. సత్పురుషులతో సహవాసం నేర్చుకో. మానవుడు ఏదిచేసినా వాడి కోసమే చేసుకొంటున్నాడు నీవు ఎవరితోనైనా స్నేహాలు చేసినా, విరోధాలు పెట్టుకొన్నా అవిఅన్నీ నీకోసమే చేసుకొంటున్నావు. నీకు నీవే ముఖ్యం ఇతరులు ముఖ్యంకాదు, ప్రపంచం ముఖ్యంకాదు అంటే నువ్వు తిరిగి తిరిగి నీదగ్గరకే వస్తున్నావు అంటే నీవు ఒక్కడివే నిజం ఎలా నిజం? దేహంగా నిజంకాదు, మనస్సుగా నిజంకాందు, బ్రహ్మంగా నిజం. ఏ మనిషికి చనిపోవాలని ఉండదు, లోపల ఉండాలనే కాంక్ష. ఎందుచేతనంటే నీలోపలఉన్నవస్తువుకు చావులేదు, అది నీవై ఉన్నావు అందుచేత చావుఅంటే నీకు ఇష్టంఉండదు. నీలోపలఉన్నవస్తువు యొక్కస్వరూపం సుఖం, దాని స్వరూపంశాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం ఉండటమే. ఆఉన్నతమైనస్థితిని అందుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి వాడు తిట్టాడు, వీడుకొట్టాడు, వాడు అలా అన్నాడుఅని ఈ గొడవలలో కూర్చొంటే ఆఉదాత్తస్థితిని మనం అందుకోలేము. మనం ఇంట్లోగడప దాటటానికే పనికిరావటంలేదు ఇంక హిమాలయపర్వతాలకు ఎలా వెళతాము. మనకు ఇంటిదగ్గర సాధనలేదు. సాధన అంటే నదిలో స్నానంచేసినంత తేలికకాదు. సమస్తవాసనలు, తలంపులు, బలహీనతలు అన్నీ నేనుఅనే తలంపును అంటిపెట్టుకొని ఉంటాయి. మీరు సాధనమొదలుపెట్టినప్పుడు ఇవి అన్నీ రేగుతాయి, ఇంతగొడవ ఉందా అని మీకు అనిపిస్తుంది. విచారణచేసేవాడికి ఆపొరలుతెలుస్తాయి, ఈగొడవఅంతా తెలుస్తుంది. మీరు సాధనమొదలుపెట్టకపోతే అజ్ఞానంలోఉండి జ్ఞానంలో ఉన్నాము అనుకొంటూఉంటారు. మన అహంభావనను అలంకరించుకొంటూ లోపలఉన్న వస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నాము. మనఅహంభావనను అలంకరించుకొనేకొలది లోపలఉన్న వస్తువుకు దూరమవుతూఉంటాము. బ్రహ్మానుభవం పొందటానికి నీవు ప్రయత్నంచేస్తూఉంటే నీకు అనేక అవరోధాలువస్తాయి, కంగారుపడవద్దు. నీవు బ్రహ్మచింతన విడిచిపెట్టకుండా ఉంటే ఈశ్వరునిపాదాలను ఆశ్రయిస్తే అవరోధాలు అన్నీ కాలిబూడిదఅవుతాయి, రాబోయేజన్మలను తీసుకొనివచ్చే వాసనలు అన్నీ ధ్వంసమవుతాయి. సత్పురుషులతో సహవాసంవలన నీవుఏదైతేకాదోఅందులోనుండి విడిపోతూఉంటావు, నీవుఏదిగా ఉన్నావో దానికి





దగ్గరవుతావు. ప్రపంచంలో దేనిమీద మమకారం పెట్టుకోవద్దు, దుఃఖానికి కారణం మమకారం. నీచేతిలో ఉన్న పనిని శ్రద్ధగాచెయ్యి, నిర్మలంగాచెయ్యి, ప్రియ అప్రియములు లేకుండా చెయ్యి, కోపతాపములు లేకుండా చెయ్యి. ఫలితం భగవంతుడికి విడిచిపెట్టు, వచ్చేదిఏదో వస్తుంది రానిది ఏదోరాదు. ఒకవేళ కర్మఫలం ఎలా ఉన్నా అది అశాశ్వతమే, కాలప్రవాహంలో అది నశిస్తుంది. మీదేహప్రారబ్ధమును బట్టి హెచ్చుతగ్గులు వస్తూఉంటాయి. నీకు భగవంతుడు ఏపని అయితే కేటాయించాడో దానిని నిర్మలంగాచెయ్యి, చప్పట్లుఅనవసరం, సన్మానాలుఅనవసరం. మీకు మంచిపనులు చేసినా సన్మానాలు చేయించుకొంటారు అనుకోండి ఆమంచిపనులకు సంబంధించిన ఫలితం ఈ లోకంలోనే అయిపోతుంది, ఇంక మీరు చేసినచెడ్డపనులకు నరకంమిగులుతుంది. ఒకడు చాలామంచి పనులుచేసాడటకాని మరణానంతరం నరకానికి వెళ్ళాడట. అప్పుడు వాడు అడిగాడట నేను చాలా మంచిపనులు చేసాను లెక్కప్రకారం స్వర్గానికి వెళ్ళాలికాని నరకానికి తీసుకొనివచ్చారు ఏమిటి, మీరు పొరపాటుచేస్తున్నారా ఏమిటి అని అడిగాడట. ఏదీపొరపాటుకాదు నీవు మంచిపనులుచేసావు, లోకంలో గుర్తింపుకోసంచేసావు, అక్కడ సన్మానాలు పొందావు అంటే మంచిపనుల యొక్క ఫలితం అక్కడేఇచ్చేసారు, ఇంకనీవు చేసిన చెడ్డపనులకు నరకంమిగిలింది అంతేగాని ఇందులో మాపొరపాటు ఏమీలేదు అని చెప్పారట. అలా ఊరేగింపులకు, సన్మానాలకు, అవార్డులకు అలవాటుపడితే వాటికోసమే పనులు చేస్తూఉంటే వాడేకాదుమన పరిస్థితికూడా అంతే. ప్రతీపని మనంగుర్తింపుకోసం చేయటం, లోకం గుర్తిస్తే మనకు కలిసివచ్చేదిఏమిటి? ఈశ్వరుడు ప్రీత్యర్థం చేసేవాడికి గుర్తింపు ఎందుకు. నిజమైన ఆనందం నీహృదయంలోనే ఉంది అక్కడతప్పించి ఎక్కడైనా ఆనందం ఉంది అని నీకు అనిపించినా అది సుఖరూపంలో కనిపించేదుఃఖమే. తాత్కాలికంగా నీకు అక్కడసుఖం అని అనిపించినా పరిణామంలో దుఃఖంవచ్చి తీరుతుంది. నీమనస్సు ఏహృదయంలో అయితే లయిస్తోందో అక్కడే నిజమైన ఆనందం ఉంది. రహస్యంఅంతా మనస్సులోనే ఉంది మనస్సు నశించకుండా ఆత్మజ్ఞానంరాదు. ఒకసారి భగవాన్ హాలులో కూర్చొని ఏదోచెపుతున్నారు, అక్కడ ఐదుగురు ఉన్నారు. అప్పుడు భగవాన్ ఒకమాటఅన్నారు. నేను చెప్పేమాటలకు మీఐదుగురుమాత్రమే వారసులుకాదు సహృదయంఉన్నవారు ఈసృష్టిలో ఏమారుమూలఉన్నా కూడా ఈజ్ఞానసంపదకు వారుకూడా వారసులే అని చెప్పారు. అయితే మీలోఎవరికైనా సహృదయం ఉంది అనుకోండి మీపట్ల నాకు అసూయఉంటే ఆ

సహృదయం నాకు తెలియదు. మనకు అర్హతలేనప్పుడు భగవంతుడేవచ్చి మనప్రక్కన కూర్చొన్నా ఆయనను మనం గుర్తించలేము. కృష్ణుడు భగవంతుడేఅని చాలామంది కౌరవులకుచెప్పారు. కాని వారు కృష్ణుడిని భగవంతుడిగా చూడలేదు, వారిలో ఉన్న దుష్టవాసనలు కృష్ణుడిఔన్నత్యాన్ని గుర్తించనీయలేదు, చివరకు నాశనంపొందారు, ఇదిగుర్తుపెట్టుకోండి. మీరు ఎన్ని శాస్త్రాలుచదివినా, మీకు ఎన్నిసంపదలు ఉన్నా, మీకు ఎంతతెలివిఉన్నా, ఎన్ని సాధనలుచేసినా ఒక్క ఆత్మజ్ఞాని సమక్షంలో మనంకూడా జ్ఞానంసంపాదించాలి అనే బుద్ధికలుగుతుందికానిమరోరకంగా మీకు ఆబుద్ధి కలిగేఅవకాశంలేదు. మీరు ఎన్నోరచనలు చేయవచ్చు, ఎన్నో ప్రవచనాలు మీరు వినవచ్చు కాని అసలువిషయం మీరు గ్రహించలేకపోవచ్చు. కాని సత్యానుభవం పొందినవాడి సమక్షంలో మీరు ఉండటంవలన అసలు సత్యంఅంటే ఏమిటి, శాంతి అంటే ఏమిటి దానితాలూక అవగాహనఎంతోకొంత కలుగకుండా మీరు ఉండలేరు, జ్ఞానంయొక్క వైభవంఅట్టిది. ఒకనాస్తికుడు, ఒకఆస్తికుడు కూర్చొన్నారట. అక్కడకు నారదుడు వచ్చాడు. నాస్తికుడు ఏమన్నాడు అంటే దేవుడు ఉన్నాడా అనినారదుడిని అడిగాడట. ఉన్నాడు అని నారదుడుచెప్పాడు. ఎక్కడ ఉన్నాడుఅని అడిగాడట. ఆయనదగ్గరనుండే వస్తున్నాను అని నారదుడుచెప్పాడు. అయితే ఆయన ఏమిచేస్తున్నాడు అనిఅడిగాడట. సూదిబెజ్జంలోనుండి ఒంటెలను, ఏనుగులను బయటకు లాగటానికి ప్రయత్నంచేస్తున్నాడు అని నారదుడు చెప్పాడు. అప్పుడు నాస్తికుడు ఏమనుకొన్నాడు అంటే ఒకవేళదేవుడు ఉన్నా, నిజంగా వాడు పిచ్చవాడే సూదిబెజ్జంలోనుండి ఏనుగును లాగటంఏమిటి అనుకొన్నాడు. అక్కడఉన్న భక్తుడు ఏమనుకొన్నాడు అంటే సూదిబెజ్జంలోనుండి మనం ఏనుగును తియ్యలేకపోవచ్చు, జరుగరానిది జరిగేటట్లు చేయగలసమర్థత భగవంతుడికి ఉంది, ఆసమర్థతను మనకు తెలియజేయటంకోసం నారదుడు చెపుతున్నాడు అనుకొన్నాడు. నాస్తికుడికి, భక్తుడికి సబ్జక్టును తీసుకోవటంలో యిద్దరికి ఎంత తేడా ఉందోచూడండి. నారదుడు చెప్పినమాట ఇద్దరూ విన్నారు. ఆమాటలువిని నాస్తికుడేమో దేవుడు పిచ్చోడు అనుకొన్నాడు, ఆస్తికుడేమో దేవుడికి అసాధ్యమంటూ ఏమీలేదు, అన్నీసాధ్యమేఅనుకొన్నాడు. జ్ఞాని ఎవరినీ ప్రేమించాలని ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడుకాబట్టి ప్రేమిస్తాడు. నిప్పకువేడిఎంత సహజమో జ్ఞానికి శాంతి, ప్రేమ, ఉండటం అంతసహజం. నదులలో స్నానాలుచేయవచ్చు, విగ్రహాలను ఆరాధించవచ్చు కాని జ్ఞానిసహవాసంతో ఇవి సరికాదు. గురువు యొక్క దయవలన





నీవుతొందరగా పవిత్రుడవు అవుతావు. ఉపాసనలేకుండా వాసననశించదు. నారాయణుడు అనే వైద్యుడుని ఆరాధించటం ఎందుకంటే, ఆయన పాదాలను ఆశ్రయించటం ఎందుకంటే ఉపాసనలేకుండా పునర్జన్మను తీసుకొనివచ్చేవాసనలు నశించవు. ఉపాసనవలన, శరణాగతివలన వాసననశిస్తుంది. అన్నింటికంటే ఉదాత్తమైనది, శక్తివంతమైనది ఈశ్వరునిదయ. ఈశ్వరునిదయను పొందటంకోసం మనంమంచి తలంపులతో, మంచి ఆలోచనలతో మనస్సును నింపుకోవాలి. మనశరీరాన్ని, మాటను, మనస్సును ఈశ్వరునిదయ పొందటంకోసం మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. సంసారంఅంటే ఏమీలేదు చనిపోవటం పుట్టటం మరల చనిపోవటం పుట్టటం ఇదేసంసారం. ఈసంసారం అనే రోగంలోనుండి విడుదలచేసే వైద్యుడే నారాయణుడు. సాధనపేరుమీద ఎంతోకొంతబాధ ఉంటుంది. సాధనపేరుమీద ఎక్కువబాధలేకుండా, వేదనలేకుండా భగవదనుభవం మీకు కలుగజేయటానికి గురువు ప్రయత్నంచేస్తాడు. గురువుతో ఉన్నఅనుబంధం ఈశరీరంతో పోయేదికాదు. ఆయన ఏస్థితిని అయితే పొందాడో ఆస్థితి మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ప్రతీజన్మలోను గురువు మనలను వెంటాడతాడు, వాడు గురువు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-08-2003, విజయవాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేను, నాది అనే తలంపులు ఉన్నంతకాలం మానవుడు అశాంతిలోనుండి విడుదల పొందలేడు, దుఃఖంలోనుండి విడుదలపొందలేడు, రూపబుద్ధి, నామబుద్ధి వాడిని విడిచిపెట్టవు. నేను, నాది అనేతలంపులలోనుండి విడుదల పొందటమే సాధన యొక్కగమ్యం. భగవంతుడిని స్మరించటం వలన ఆయన రూపాన్ని ధ్యానించటంవలన మనం పవిత్రులం అవుతాము. మనకు లోపల పవిత్రత ఉండాలి, చేసేపనిలో ప్రవీణత ఉండాలి, ముఖ్యంగా ఏకాగ్రత ఉండాలి. భక్తులలో ప్రహ్లాదుడు అంటే నాకు ఇష్టం. ప్రహ్లాదుడిని అనేకబాధలు పెట్టారు, అనేకరకాల హింసలకు గురిచేసారు. మనకు శారీరకంగాకాని, సంసారపరంగా కాని ఏదైనా చిన్నబాధ కలిగితే ఆబాధలోనుండి విడుదలచేయమని భగవంతుడిని ప్రార్థిస్తాము. కాని ప్రహ్లాదుడిని ఎన్నిబాధలుపెట్టినా, ఎన్నిరకాలుగా హింసించినా ఆబాధలలోనుండి,